క్లుప్తంగా

దెందులూరులో వైఎస్సార్ సీపీ స్థూపం నిర్మాణం



దెందులూరు దళితవాడ వైఎస్సార్ సర్కిల్ వద్ద నిర్మించిన వైఎస్సార్ సీపీ స్థూపం

దెందులూరు: దెందులూరు గ్రామం పెద దళితవాడ వైఎస్సార్ సర్కిల్‌వద్ద ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనల మేరకు పార్టీ నాయకులు, కాంట్రాక్టర్ కామిరెడ్డి బాలు పార్టీ స్థూపాన్ని నిర్మించారు. బాలుకు పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న గృహం ప్రారంభోత్సవం



శ్రీరామవరంలో జగనన్న నూతన గృహాన్ని ప్రారంభించిన కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: నవరత్నాల పథకం పేదలందరికీ వరమని, పేదల పాలిట సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేవుడని శ్రీరామవరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం శ్రీరామవరంలో నవరత్నాల పథకంలో జగనన్న నూతన గృహాన్ని లబ్దిదారుడు కొత్తపల్లి గాబ్రియేలు కుటుంబ సభ్యులతో కలిసి నాని ప్రారంభోత్సవం చేశారు.పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, కామిరెడ్డి బాలు, కామిరెడ్డి ప్రతాప్, నాయ కులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు ఉన్నారు.

చేబ్రోలు ఎస్సైగా మణికుమార్ బాధ్యతల స్వీకరణ



చేబ్రోలు ఎస్సై మణికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న మండల సర్పంచులు

ఉంగుటూరు: చేబ్రోలు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఏ.మణి కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన స్వామి వీఆర్‌లోకి వెళ్లారు. గతంలో ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పని చేసారు. వీఆర్‌లో ఉన్న మణి కుమార్‌ను ఉన్నతాధికారులు ఇక్కడకు బదిలీ చేసారు. ఈ సందర్భంగా ఆయనను మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు పుచ్చకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సర్పంచులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు కృషి చేస్తానని, స్నేహపూర్వక పోలీస్ విధానాన్ని అమలు చేసి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.

తుపాను బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమడోలు: తుపాను బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. పూళ్లలో శుక్రవారం సీపీఎం సభ్యులతో కలిసి ఆయన తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమశాతం నిబంధనతో సంబంధం లేకుండా ప్రతి రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రతి ఎకరాకు రూ.10వేలు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, నాయకులు మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.

తుపాను బాధిత రైతులందరినీ ఆదుకుంటాం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ముంపు బారిన పడిన పంట పొలాలు, తడిసిన ధాన్యం రాశుల పరిశీలన



అర్ధవరంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ఇటీవలి భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న సార్వా పంటను పరిశీలించి, రైతులకు భరోసా ఇచ్చారు. వాతావరణం అనుకూలంగా మారినందున త్వరగా రైతులంతా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. తడిసి రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, రైతులెవ్వరూ అధైర్యపడవద్దని అన్నారు. ఇప్పటికే సగం మంది రైతులు పంట కోయాల్సి ఉందని ఈవారం చివరికి మొత్తం కోతలు పూర్తవుతాయని వ్యవసాయ సలహా సంఘం జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే వాసుబాబుకు వివరించారు. ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన తడిసి, ముద్దయిన ధాన్యం రాసులు, నేలపై పడిపోయిన వరిపైరును పరిశీలించారు. వచ్చే దాళ్వాకు రైతులకు అవసరమైన విత్తనాలు సబ్సిడీపై అందించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు సుభాష్, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు. కొండేపాడులో యనమదుర్రు ముంపు ప్రమాదాన్ని గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వాసుబాబు అధికారులను ఆదేశించారు. వరదనీటిని యనమదుర్రు కాల్వలోకి మళ్లించడంతో దిగువ గ్రామాల్లో యనమదుర్రు మురుగుకాల్వ పరీవాహక ప్రాంతాల్లో ముంపు ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే యనమదుర్రు కాల్వ పొంగి ప్రవహిస్తోంది. కొండేపాడు వద్ద లోలెవల్ వంతెనను తాకుతూ నీటి ప్రవాహం సాగుతుంది. మరో అడుగు నీటిమట్టం పెరిగితే వంతెన పూర్తిగా మునిగిపోతుందని గ్రామ సర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు తెలిపారు. నీటిమట్టం గట్ల సరాసరికి ప్రవహిస్తుందని, గట్లు బలహీనంగా ఉన్న చోట్ల, మట్టి, ఇసుక బస్తాలను అడ్డుగా వేసి వరదనీరు గ్రామంలోకి రాకుండా కాపలాకాస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణం తెరిపి ఇచ్చి, ఎండకాయడంతో కాల్వలో నీటి ప్రవాహం క్రమంగా తగ్గవచ్చునని గ్రామస్తులు, అధికారులు భావిస్తున్నారు.



కొండేపాడులో యనమదుర్రు గట్టుపై అడ్డుగా వేసిన ఇసుక, మట్టి బస్తాలు

అలుగులగూడెంలో..

దెందులూరు: అలుగులగూడెంలో రూ. 32 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లకు శుక్రవారం దెందులూరు పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు శంకుస్థాపన చేశారు. దెందులూరు వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో అలుగులగూడెంలో జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ప్రజాప్రతినిధులు ఎగురవేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబరు స్వరూపారాణి, పార్టీ నాయకులు, వలంటీర్లు ఉన్నారు.

13,479 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలింపు

ఉంగుటూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా తడిసిన 13,478.8 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మండల తహసీల్దార్ రమణారావు అన్నారు. మండంలోని కైకరం, తల్లాపురంలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఏవోతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిన్నింటినీ పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. మండల పరిధిలో తల్లాపురం ఆర్‌బీకే పరిధిలో 597.6 క్వింటాళ్లు, కైకరం-1 ఆర్‌బీకే నుంచి 5346.2 క్వింటాళ్లు, కైకరం-2 ఆర్‌బీకే నుంచి 7,535 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొంచెం ఆరుదల అయిన వెంటనే కైకలూరులోని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. రవాణాకు లారీలు సిద్ధంగా ఉన్నాయని, ప్రతి రైతుకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, అధైర్యపడొద్దని ఆయన తెలిపారు. ఏవో బాలిన వెంకటేష్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తల్లాపురంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారావు

కాళింగ సంఘ మండల అధ్యక్షుడిగా గురువెల్లి రాజారావు



కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారావును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ఉంగుటూరు: మండల కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గురువెల్లి రాజారావును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలోని లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన మండల కాళింగ సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉపాధ్యక్షుడిగా బొమ్మిడి అనిల్, కోశాధికారిగా బొమ్మిడి బాలకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీవీ సత్యనారాయణతో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజారావు మాట్లాడుతూ కాళింగులంతా రాజకీయాలకుతీతంగా ఐక్యతగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గురువెల్లి రాజారావును రిటైర్డ్ జవాన్ షిఫాన్ శివకుమార్ సంఘం నాయకులు దుశ్శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సాధించుకోవాలి

ఏలూరు రూరల్: సుస్థిర, సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతి ఒక్కరూ ఓటు ఉపయోగించుకోవాలని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 15 డివిజన్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీలోపు అర్హతున్న ప్రతిఒక్కరూ ఓటు సాధించుకోవాలన్నారు. ఇందుకోసం బీఎల్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు పాటించి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు పొందేలా సహకరించాలని అన్నారు.

అన్ని వర్గాలకూ అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



గ్రామంలో సంక్షేమ పథకాలు అందించిన వివరాల పట్టికను ప్రారంభిస్తున్న ఎంపీపీ తాతా రమ్య, ఇతర నాయకులు

పెదవేగి : ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచామని పెదవేగి తాతా రమ్య చెప్పారు. జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ సాగే ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం పెదవేగి మండలం పెదవేగిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తాతా రమ్య పాల్గొన్నారు. ముందుగా గ్రామ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక తురాయి చెట్టు సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్లలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా మన రాష్ట్రం సాధించిన పురోభివృద్ధిని అందరికీ క్షుణ్ణంగా తెలియజెప్పేలా, గత సర్కారుకు – వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రజలకు చెప్పేందుకు, 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన విషయాన్ని ప్రజలకు మేనిఫెస్టో చూపిస్తూ వివరించే అద్భుతమైన కార్యక్రమమే వై ఏపీ నీడ్స్ జగన్ అని బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా సంక్షేమ పథకాల ప్రదర్శన ఫ్లెక్సీని గ్రామ నాయకులు తాతా సత్యనారాయణ, ఎంపీపీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, ఈఓఆర్డీ శ్రీనివాసులు, మేడికొండ కృష్ణారావు, సచివాలయ కన్వీనర్లు ఇతర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వట్లూరులో 'పల్లెకు పోదాం'

పెదపాడు: వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి తద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ కొనియాడారు. పెదపాడు మండలంలోని వట్లూరులో గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోయేషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, గుజ్జుల రత్నకుమారి, చింతా మధు, బత్తుల ఏసురాజు పామర్తి అచ్యుత్‌గౌడ్, సాధం కిశోర్ పాల్గొన్నారు.

శివాలయంలో లక్ష చామంతులతో విశేష పూజ



శివాలయంలో సామూహిక లక్ష చామంతుల పూజల్లో పాల్గొన్న మహిళలు

భీమడోలు: గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో మహిళలతో సామూహిక లక్ష చామంతుల పూజ వైభవంగా నిర్వహించారు. కార్తీక బహుళ ఏకాదశి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి లక్ష చామంతుల పూజల్లో పాల్గొని తమ భక్తి చాటుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. అనంతరం స్వామి వారి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.

'ఆడుదాం ఆంధ్ర'తో గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహం



సచివాలయ సిబ్బందికి కిట్లను అందిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి

ఉంగుటూరు: గ్రామీణ యువ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి అన్నారు. ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలోని 25 సచివాలయాలకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వచ్చిన క్రీడా సామగ్రిని వారు చేతుల మీదుగా సచివాలయ సిబ్బందికి అందజేసారు. వాలీబాల్, బాల్స్, షటిల్స్ కాక్స్, క్రికెట్ కిట్లు తదితర క్రీడా సామగ్రిని వారికి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు క్రీడల పట్ల నిర్లక్ష్యం వహించాయని అన్నారు. క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని యువ క్రీడాకారులంతా విధిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో 2,240 రిజిస్ట్రేషన్లు

దెందులూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో దెందులూరు మండలంలో ఇప్పటి వరకు 2,240 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చైర్మన్ డాక్టర్ మరీదు మనోహర్, దెందులూరు మండల కన్వీనర్ జక్కుల సురేష్ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ 5 క్రీడల్లో 4,560 రిజిస్ట్రేషన్లకు 2,240 రిజిస్ట్రేషన్లు 47 శాతం నమోదైందన్నారు. ఇప్పటికే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నూరు శాతం విజయవంతానికి ఫిజికల్ డైరెక్టర్లకు, పీఈటీలకు జిల్లా విద్యాశాఖ తరపున శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలు గుర్తెరిగి నూరు శాతం విజయవంతమయ్యేందుకు దెందులూరు మండలానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మనోహర్, సురేష్ కోరారు.

లక్ష్య సాధనకు వైకల్యం అడ్డు కాదు



గణపవరంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శేషు



నిడమర్రులో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవో రాంబాబు

గణపవరం: అనుకున్న లక్ష్యం సాధించాలంటే వైకల్యం అడ్డుకాదని, కృషి, పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చునని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శుక్రవారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పిప్పర భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దివ్యాంగ విద్యార్థులు ఇతరులతో పోటీపడేలా ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.ఏ సుబాబు, ఎంపీటీసీ తాతాజీ, ప్రత్యేక ఉపాధ్యాయులు షహనావాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో..

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉందని, ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకోవాలని నిడమర్రు ఎంఈవో కె.రాంబాబు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిడమర్రు భవిత కేంద్రంలో విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినికిడి లోపం తదితర సమస్యలు ఉన్నవారికి ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు ఇల్లపు నవ్యశ్రీ, ఎంఆర్‌పీ అప్పారావు, హెచ్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

సాకేతరామ కల్యాణ మండపానికి శంకుస్థాపన



గోపన్నపాలెంలో సాకేతరామ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేసిన కొఠారు రామచంద్రరావు

దెందులూరు: గోపన్నపాలెంలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నూతనంగా గ్రామస్తులందరి అవసరాల కోసం సాకేతరామ కల్యాణ మండపానికి ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతులు శుక్రవారం ఉదయం శంకుస్థాపన పూజ చేశారు. గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట స్థలంలో గ్రామస్తుల అవసరాల నిమిత్తం కల్యాణ మండపం నిర్మాణం అవసరాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వివరించామన్నారు సహృదయంతో వెంటనే ఆ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి అంగీకరించినందుకు గ్రామస్తులందరి తరపున ఎమ్మెల్యేకు, రామచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ కొండేటి గంగాధర బాబు, కొండేటి హనుమంతు, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు ఉన్నారు.

సీతారామస్వామి ఆలయంలో విశేష పూజలు



గుండుగొలనులో సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ప్రసిద్ధి గాంచిన సీతారామస్వామి ఆలయంలో కార్తీక బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ట్రస్టీ ఫౌండర్ కొండ గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుధీరాచార్యులు పర్యవేక్షణలో అర్చక బృందం శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి ముస్తాబు చేసారు.

కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చే కళాకారులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు సమర్పించాలని కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 99899 61085లో సంప్రదించాలన్నారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష పదవికి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల పర్యవేక్షకుడు గాధంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సంఘం అధ్యక్ష స్థానానికి ఈ నెల 14 -15వ తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.